# అనుబంధాలు

కేశవ గోపాల్

'గణగణ'మంటూ టెలిఫోన్ మ్రోగింది.గది లోని నిశ్శబ్ధతను భంగపరుస్తూ కెప్టెన్ వీరభద్రం పనిలో మునిగినవాడల్లా తలెత్తి, దీర్ఘంగా శ్వాసవిడిచి, పెన్సిల్ టేబుల్‌పై పడేసి, హుక్ మీదనుండి రిసీవర్ అందుకున్నాడు.

ఫోన్ ఇంటి నుండి వచ్చినట్లుంది!

''కమాండర్జీ! మీ తండ్రీగారు వచ్చారు మిమ్మల్ని చూడాలని'' అవతలినుండి కంఠం వినిపించింది. అది కెప్టెన్ వీరభద్రంగారి గుమస్తా కంఠస్వరం........

''ఊఁ....!' రిసీవర్ హుక్కుమీద పెట్టేసి, దీర్ఘంగా నిట్టూర్చాడు..... ''వచ్చాడన్నమాట యిప్పటికి'' గొణుక్కున్నాడు తనలో తనే. ఫోన్‌లో విన వచ్చిన విషయం అతన్ని ఆశ్చర్యాబ్ధిలో ముంచేసింది....ఒక్కసారిగా అతని మనస్సు విచలితమై, అశాంతి భూయిష్టమై పోయింది. కాస్సేపటివరకు అచేతనావస్థలోవుండిపోయాడు వీరభద్రం. ఆ వార్త అతనిలోపూర్తిగా మార్పు తెచ్చింది. ఏం చెయ్యడానికి పాలుపోలేదు. చివరకు తెప్పరిల్లి, తాను చూస్తూ వుండినకాగితాలు తిరిగి ముందేసుకుని, పరిశీలనగా చదవబోయాడు.

కానీ,ఒక్కవాక్యంకూడాచివరిదాకా పూర్తిచెయ్యలేకపోయాడు. అక్షరాలన్నీ గెలికినట్లుగా అల్లిబిల్లికగా అగుపించాయి. ..చీమల బారుల్లా పరుగెత్తుతున్నట్లనిపించింది. దృష్టి మనస్సునేకాక దృష్టినిగూడా వాటిపై మరల్చలేకపోయాడు. అర్థంలేని భావాలు మనసులో యిటూ టు పారాడజొచ్చాయి. తలను రెండు చేతుల్లో పెటుకుని టేబులుకానించి ఆలోచనా ప్రవాహాన్ని అరికట్టడానికి ప్రయత్నించాడు.

కానీ......అతడు వచ్చేశాడు... యిప్పుడేం చెయ్యాలి?' అన్నవిషయం తిరుగు లేని ప్రశ్నగా విషమ సమస్యగా తయారై అతన్ని కలిచివేయ సాగింది.మనస్థిమితంలేక బలంగా ముళ్ళుగ్రుచ్చుకొన్నట్లుగా అయింది.

జనరల్ వీరభద్రానికి విషయం క్రొత్తదేం కాదు. ఆరు మాసాలుగా అతణ్ణి సమస్యబాధపెడుతోంది. పోయిన మే నెలలో ఓ పత్రికా కార్యాలయంనుండి తన పేరున ఓ వుత్తరం వచ్చింది. ఆ వుత్తరం కలకత్తా ప్రాంతంనుండి పత్రికాముఖంగా తనకుచేరడంవల్ల—ఆ ప్రాంతాల్లో తనకు తెలిసినవ్యక్తి ఎవరా అని ఆశ్చర్యపడ్డాడు వీరభద్రం. ఆదుర్దాగా కవరుచింపి, వుత్తరం తీసి, చదవబోయాడు.

'ప్రియమైన కుమారునికి ... ..!

మరింత ఆశ్చర్యంతో తికమకపడ్డాడు. యిదేమిటి.....ఈ సంబోధనా...విపరీతంగా వుందే....' తనలోనే గొణుక్కొన్నాడు.బొమముడి ముడిచి తీక్షణంగా కాస్సేపు వుత్తరాన్ని ఇటునటుత్రిప్పి, పెద్దగా నవ్వేస్తూ,

''ఓయ్! డియర్ ఫ్రెండ్!....ఈ తమాషా చూశావా....' పకపక నవ్వుతూ, యిటుతిరిగి, ప్రక్కనేవున్న మిత్రు'ణ్ణి పలుకరించాడు.

''పాపం! ఎవరో పొరపాటున నన్ను'**కుమారా!**' అని సంబోధిస్తూ **వుత్తరం వ్రాశారయ్యా** బాబూ!''

''ప్చ్.....!''

వుత్తరం మరల చదువసాగాడు నవ్వుతూనే. కాని ఆ నవ్వు ఎంతో సేపు నిలువలేదు. చదువుతున్న వాడల్లా టక్కున ఆగిపోయాడు. అంత సేపూ అతని ముఖంలో వున్న హాస్యరేఖలు పరుగెత్తిపోయాయి నొసలుచిట్లించి, కళ్ళుకుంచించి మరింతగా వుత్తరానికేసి చూశాడు.

''.....ఐదేండ్ల క్రితం సంగతి డెహరాడూన్ నుండి తిరిగివచ్చిన సిపాయి చెప్పాడు.నీవెక్కడో యుద్ధంలో మరణించినట్లు. ఆసమయంలో నాకీ ప్రపంచమే అంధకారబంధురమయింది కానీ.....కానీ.....నాలో అప్పట్లో ఆశాజ్యోతి ఆరిపోలేదు. మిణుకుమిణుకుమంటూనే వుండేది. తలపుకొచ్చినప్పుడల్లా విపరీతంగా దుఃఖించేవాణ్ణి కానీ, నీవెక్కడో ఒకచోట బ్రతికి సురక్షితంగా వుంటావనే నా అంతరాత్మనొక్కిచెబుతూవుండేది. ఈనాటికి నిజంగా నేను అనుకున్నట్లే జరిగినది.

కొద్దిరోజుల క్రితం....నీవు వ్రాసిన కథ ఏదో పత్రికలో ప్రచురితమైంది. లోకంలో ఒకే పేరు గలవారు ఎందరో వున్నారు. లేకపోలేదు గూడా. కానీ, నిజంగా నీవే నా పుత్రుడవన్న ప్రగాఢ విశ్వాసంతో ఈ వుత్తరం వ్రాస్తూ



ఉన్నాను. నీవైనా పుత్రుడవైతే నాకు తప్పక బదులు వుత్తరం వస్తుంది. లేనిచో—.....''

—వుత్తరం అంతటితోనే అర్ధాంతరంగా నిలిపివేయబడింది. బహుశా ఆముసలాయనకు ఆతర్వాత విషయం వ్రాయడానికి తగినంత ధైర్యం,సాహసం, లేకపోయిందేమో! వుత్తరం అడుగు భాగాన 'ఆశీర్వాదాలతో' అంటూ సంతకం చెయ్యబడింది. ఆ పేరు పూర్తిగా అపరిచితంగా వుంది.

నిజానికి ఆవుత్తరం వ్రాసిన ముసలాయన పూర్తిగా తప్పటడుగు వేశాడు. తనపుత్రుని విషయంలో పెద్ద పొరబాటే జరిగింది.

కెప్టెన్ వీరభద్రానికి ఇదేమంత పెద్దసమస్య గాదు! ఆ ముసిలాయన తనకేవిధంగా సంబంధించడు. ....బంధువుగానీ, పరిచయస్తుడుగానీ కాదు.... అటువంటప్పుడు ''ఇదీ విషయమంటూ'' అతని వూహసరిగాదనీ, అతనెవరో అసలు తనకు తెలీదనీ, సులభంగా, విపులంగా తెలుపవచ్చు.

కాని, కాని వీరభద్రం అలా చేయలేక పోయాడు. యీ విషయం గురించీ, ఆముసలాయన్ను గూర్చి పూర్తిగా తెలుసుకో దలిచాడు. ఆ ప్రాంతపుప్రభుత్వసంక్షేమశాఖకు ఆయన్ను గూర్చి ఎంక్వైరీ' చేసి, విషయాలన్నీ అమూలాగ్రంగా తెలుపమని వుత్తరం వ్రాశాడు.

త్వరలోనే అందుకు తగినవిధంగా జవాబు అందింది! ముసలివాడవటంవల్ల ప్రభుత్వ సంక్షేమ శాఖకల్పించిన వసతుల్లో ఆయన వున్నాడనీ, ఆరోగ్యంగా వున్నాడనీ..... ఆయనకు తన పేరుగల్ల కుమారుడుండేవాడనీ, చాలా కాలంక్రితం పటాలంలో చేరిపోయాడని..తరువాత దురదృష్టవశాత్తు మరణించాడనీ—ఆవచ్చిన వుత్తరం ద్వారా గ్రహించగలిగాడు.

ఒకనాడు బల్లముందు కూర్చుని, లెటర్‌పాడ్ ముందేసుకొని ముసలాయనకు వుత్తరంవ్రాయడానికి నిశ్చయించుకున్నాడు. నిజంగా అతని ప్రవర్తన విచిత్రంగానే వుంది. ఆ ముసలాయన విషయంలో.... కానీ, ఆలోచనలకు ఓ రూపాన్ని కల్పించి, చివరకు ఓ నిశ్చయానికి వచ్చిన వీరభద్రంకు వుత్తరం ఎలా వ్రాయాలో తోచలేదు. ఆ ప్రయత్నంలో తెల్లకాగితాలు చాలా వృధా అయ్యాయి. బుర్రవేడెక్కింది. కలంలో సిరా తగ్గిపోతోంది. అర్ధరాత్రి మీరుతోంది. కానీ యింతవరకు వుత్తరం పూర్తికాలేదు.1

ఒంటి గంట' టంగున కొట్టింది గడియారం కళ్ళు ఎర్రగా అగ్ని శిఖలయ్యాయి. నాలుగు వాక్యాలు గెలికి చింపేశాడు. ''నేను మీరనుకున్నట్లు మీ పుత్రుణ్ణి కాను.....'' అంతవరకు వ్రాసేసరికి, చేయివణికేది. యిహ వ్రాయలేక పోయేవాడు. ఏమీ తోచేది కాదు. తక్షణం దాన్ని చింపేసేవాడు.

ఒంటిగంట!.....

చివరకు—

ప్రియమైన తండ్రిగార్కి—

మొదలుపెట్టి వ్రాసాడు.! విచిత్రంగా కాసేపు పరికించాడు. 'ఎలా వ్రాయగల్గాడు తను?'—ఒకింత ఆశ్చర్యపోతూ కళ్ళు పెద్దవి చేశాడు. దీర్ఘంగా శ్వాసవిడిచాడు. యిప్పుడు మరీ భావాలు తామంతట తామే దొర్లుకు రాసాగాయి....! చకచక వుత్తరం పూర్తిచేసి, చదువుకొని, తృప్తిగా నిట్టూర్చాడు.

మరుదినం—స్వయంగా తనే పోస్టుచేశాడు 'తండ్రికి'వుత్తరం వెంట కొంత డబ్బుగూడా మణియార్డరు చేశాడు. ఎందుకో అవ్యక్తానందంతో హృదయం పులకలు వేసింది.

యీ విషయం ఎవరైనా వింటే ఆశ్చర్యపోతారు! అసహ్యించుకోవచ్చుగూడా.!

• • •

ఆరాత్రంతాచిత్రవిచిత్రానుభూతులతో,వింతాలోచనలతో, నిద్రాదేవివడిలో కమ్మని నిద్రను దూరం చేసుకుని జాగారం చేశాడు వీరభద్రం.

అసలు విషయం ఆలోచిస్తే, హృదయాన్ని తరచిచూస్తే, కెప్టెన్ వీరభద్రంకు తన విధిని తాను సక్రమంగా నిర్వర్తించాననే అనిపించింది.

వీరభద్రం తండ్రి ఇరవై సంవత్సరాలక్రితం ఈ లోకాన్ని శాశ్వతంగా వదిలిపోయాడు. ఇపుడు ఆ ముసిలాడికి రాస్తుంటే ప్రతిపదం, ప్రతి వాక్యంలో అతనికి తనతండ్రి గుర్తుకు రాసాగాడు గతస్మృతులు తెరలు తెరలుగా కళ్లెదుట పారాడాయి. కానీ ఈ తండ్రి గారి విషయంలోఅతని పేరొక్కటి తప్ప మరేం తెలియదు తనకు! తను చేయగలిగిందల్లా ఆయన స్వరూపం ఇలావుంటుందని వూహారూపంగా చిత్రించుకోవడమే! ఆయనరూపం అతను వూహించుకునేకొద్దీ, అస్పష్టంగా గోచరించసాగింది. వయసు తిరిగిన పండు ముసలి. పెద్దగడ్డం. లోతుకుపోయిన కళ్ళు. ముడతలు పడ్డకళ్ళు,ముఖం, కనుబొమలు తలపైని వెంట్రుకలు తెల్లగా పండిపోయినయ్. ఎడమచెవిక్రింద ఓ పెద్ద పుట్టుమచ్చ (బహుశ వుండి వుండచ్చు.) యింకా........

ఈ వర్ణన చాలదేమో. ఆయన రూపాన్ని యింకా ఎలా వర్ణించాలో'పాపం! ఇరవైయేళ్ళుగా తనప్రియపుత్రుని కోసం ప్రాణం పిడికిటపెట్టుకొని, లోతుకుపోయిన కళ్లలో ఆశ పెట్టుకుని నిరీక్షిస్తున్నాడేమో!

అరె! ఇంతకు ఆయన నిజపుత్రుని విషయం ఏమిటి....అతడేమైనట్లు?...అతడు చాలాకాలం క్రితం మరణించినట్లు ఆయన విన్నాడట వీరభద్రం ఆలోచనలుమరోవేపుకుమళ్లాయి. తనతో పనిచేసి, మధ్యలోనే అసువులుబాసిన తోటి ఉద్యోగులపైకి అతని మనస్సు పరుగుపెట్టింది. సాలోచనగా కిటికీగుండా, ఎదురుగావున్న పండు జారిపోయిన చెట్లవేపు పరధ్యాన్నంగా చూస్తూండిపోయాడు.......!

నాలుగోదళం అధిపతి 'వీరభద్రం'ఈ ముసలాయన కొడుకేమో కానీ ఆ వీరభద్రం నదిని దాటుతూ మరణించాడు. లేకపోర్టర్మంచులో ఇరుక్కుని అరుస్తుంటే రక్షించబోయి కడకు తనే ప్రాణాలను పోగొట్టుకొన్న అభాగ్యుడు.

అయితే వారిపేర్లూ, ఈ ముసలాయన కొడుకూ పేరు ఒకటిగాలేవు. 'ఎందుకీ, అసందర్భపు ఆలోచన్లు! ఏమిటి పిచ్చియోచనలు. ఛీ.... ఛీ.... — విసుక్కున్నాడు—

కళ్లుమూసుకొని నిద్రకుపక్రమించబోయాడు. వుహు..మనస్సు అతని అదుపాజ్ఞలో వుండలేకపోయింది. గతస్మృతుల్లోకి తొంగిచూస్తోంది. పుటలు తిరిగి పోతూనేవున్నై. హఠాత్తుగా ఓ పుట దగ్గర ఆగిపోయింది మనస్సు. ఆ పుటలోని దృశ్యం మహాభయంకరంగా, జాలికరంగానూ వుంది—తదేకంగా ఆ దృశ్యాన్నే చూడసాగాడు.

అది విశాలమైన భూ భాగం. పచ్చగడ్డి కనుచూపు మేర పచ్చని పట్టు తివాసీలా పెరిగి వుంది. చెట్లు చేమలతో అత్యాకర్షణీయంగా వుంది. ప్రకృతిమాత! ఆ భాగం లెక్కలేనన్ని నీటిగుంటలు ప్రక్కప్రక్కగానే వున్నాయి. చూపులకుస్వచ్ఛమైన నీటితోనే నిండివున్నాయి. గుంటచుట్టూ అడుగేస్తే దిగబడి, కూరుకు పోయేలా వున్న బురద, దట్టంగా వ్యాపించివున్న గడ్డిదుబ్బులూ. చాలా రమ్యంగా వుంది చూట్టానికి.

దాహంతో అల్లాడే అమాయకుడైన అతడు ఆ గుంటలకు బలిఅయ్యాడు. జాగ్రత్తగా నీటి దరికి చేరినా....దురదృష్టవంతుడు తనప్రాణాలకే ముప్పుతెచ్చుకున్నాడు. ఆ నీటి గుంటలు పైకి స్వచ్ఛంగా, నిర్మలంగావున్నా అడుగుపెట్టిన ప్రతి దాన్ని భద్రంగా తమలో దాచుకుంటూ యని వూహించలేదు.

అడుగుపెట్టిన చోట మెల్లగా ఎడం ఏర్పడి అతడి కాళ్ళు కూరుకు పోయాయి. ఆశ్చర్యంగా. కాళ్ళు పూడుకుపోవడంతో అతను బెంబేలెత్తి పైకి లాగడానికి ప్రయత్నించేకొద్దీ, పెనుగులాడేకొద్దీ అగోచరమైన మహాశక్తి అతన్ని మరింతగా లోనికి ఆహ్వానిస్తోంది.

కొద్ది నిమిషాల్లోనే యీ సంఘటన అందర్నీ భయ భ్రాంతుల్ని చేసింది.

మోకాళ్ళు—తొడలు, నడుం..అతి వేగంగా లోపలికి లాక్కొంటూంది నీటిగుంట. అందరు ఒక్కుమ్మడి అతని రక్షణార్థం ప్రయత్నించారు.

తమలో ఒకతను తన రైఫిల్ సరిగ్గా అతని ఎదరకు నిలిపేసి ''దానిమీద పడుకో. త్వరగా దొర్లు....వూ!''గొంతు చించుకొంటూ అరిచారు. అందరికీ అర్థమయ్యిందా నీటిగుంట మహత్వం. అందుకే ఎవ్వరు సాహసించలేక పోయారు. ఎవరిప్రాణాలు వాళ్లకు తీపేగా మరి!!

అతనతిప్రయత్నం మీద దానిపై పడుకో ప్రయత్నించాడు. ఆ సమయంలోనే అతనెవరయిందీ తను గుర్తించగలిగాడు. అతడు ఆరవ దళపు సోల్జరు. అతనిపేరుకూడా వీరభద్రమే! తన మనస్సు అతనిస్థితికి చాల బాధపడింది! కాని ఏంచేయ గలడు?

రైఫిల్‌పట్టుకొని ఆ వూబిలోనుండి తన శరీరాన్ని పైకి లాక్కోడానికి చేయవలసిన ప్రయత్నమంతా చేసాడు. చేసిన ప్రయత్నమంతా నిష్ఫలం కాగా అతను మరింత వూడుక పోయాడు. చివరకు వుత్తమాంగం గూడ మునిగి పోయే సమయంలో లేనిశక్తినంతా కూడగట్టుకొని,

"స్నేహితులారా! వెళుతున్నా .... గుడ్‌బై.." అన్నాడు.

అంతే ...! తలగూడా వూబిలోనికి దాక్కుపోయింది.... అతని హస్తంమాత్రం రైఫిల్‌ని ఎత్తిపట్టుకొనివుంది. ఆ రైఫిలుకు పైభాగంలో 'అతని' చేతిసంచీ తగిలించి వుంది., నీటిగుంట బుడబుడలు మాని, శాంతించింది తృప్తితో...! అతని టోపీపైని జాతీయచిహ్నంతో తేలియాడుతోంది.

— పుట తిరిగిపోయింది. మనస్సు మెల్లగా ప్రక్కకు తప్పుకుంది... కెప్టెన్ వీరభద్రం గుండె బరువెక్కింది... కనురెప్పలు నీటితో తడిశాయి... తమను కాపాడ్డానికి చివరకు తన ప్రాణాలనే బలిచేశాడు అమరజీవి! .... వీరమరణం" అన్న పలుకులు అప్రయత్నంగా అతని పెదాలనుండి వెలువడ్డాయి.

ఆరోజు తన సైనిక జీవితంలో మరువురాని రోజు! ! వీరభద్రం ఆత్మశాంతికి గాను తను ప్రతిఫలంచేయాలని ఎప్పట్నుంచో అనుకుంటూ వచ్చాడు. కాని తగిన అవకాశం ఇంత వరకు లభించలేదు.

యీసమయంలో అతను ఈముసలాయన కుమారుడైతే మరీ మంచిది. యీవిధంగానైన తను ఆయనకు కుమారుడు లేనిలోటు తీర్చి ఆత్మానందాన్ని కలిగిస్తే .... అతని ఆత్మ తృప్తి పడుతుంది.

ఇక కార్యరంగంలోకి అడుగెట్టి, తన పాత్రను సమర్థనీయంగా నిర్వర్తించాలనుకున్నాడు...

.... ఆ ముసలాయన కుమారుడు ఇరవై సంవత్సరాల క్రితం ఆర్మీలో చేరిపోయాడు. అతను మరణించాడు గానీ, అతన్ని గూర్చిన వివరాలు తనకు తెలియవు.ఆ ముసలాయన యిరవై సంవత్సరాలుగా కన్నకొడుకు ఆగమనంకై కళ్ళలో వత్తులు వేసుకొని కాలగమనాన్ని లెక్కచేయక, ఆతృతతో కనీసం కొడుకు విషయం ఏమాటకైనా వినడానికి తృష్ణ నయనాలతో నిరీక్షిస్తూ వుండివుంటాడన్న విషయం సత్యదూరం కాదు!

ఆ ముసలాయనకు తృప్తి, ఆనందంతో, చివరి గడియల వరకు హాయిగా గడపాలంటే తను అతని కొడుకుగా ప్రవర్తించాలి..." నవ్వుకొన్నాడు వీరభద్రం విచిత్రంగా!

చివరకు యీ నిర్ణయానికి రావడంతోనే 'తండ్రిగా'రికి అంటూ సంతృప్త హృదయంతో వుత్తరం వ్రాశాడదినం..

ఆనాటి నుండి వీరభద్రం ఆముసలాయన కుమారుడయ్యాడు. వారిద్దరి మధ్య విడదీయరాని బంధం ఏర్పడిపోయింది. యిరువురు తండ్రీ కొడుకులుగా వుత్తరాలు వ్రాసుకొన్నారు. ఆముసలి హృదయం తన కొడుకు వుత్తరం చూసుకుని ఎంతగాఎంతగా మైమరచిపోయేదో!!

ప్రతినెలా జీతమందగానే ఆయనకు కొంత డబ్బు, ఓవుత్తరం పంపడం అలవాటయి పోయింది వీరభద్రానికి. అలాచెయ్యడం ద్వారా వీన విద్యుక్తధర్మం నెరవేర్చుకుంటున్నానన్న సంతోషం అతనిలో కలిగేది!

రోజులు గడిచేకొద్దీ వీరభద్రం అవ్యక్తానుభూతితో వుక్కిరి బిక్కిరి అయిపోతున్నాడు. వుత్తరాల ద్వారా వాళ్ళిద్దరి మధ్య ఏదో తెలియని 'అనుబంధాలు' తమ యిద్దర్నీ మరింత దగ్గరకు చేరుస్తున్నాయనీ, సంబంధం చాలా దృఢతర మవుతోందని తెలుసుకోగలిగాడు.

చలికాలం రాగానే 'తండ్రిగారికి' భార్యచేత ఒక స్వెట్టర్ అల్లించి పంపాడు వీరభద్రం ప్రేమగా. కాని, ఒకందుకు వీరభద్రం బాధపడసాగాడు. ఆముసలాయన తననే పుత్రునిగా భావించి యింతకాలం హాయిగా గడిపాడే... కొంపదీసి అసలురహస్యం బయటపడితే ఇంకేమన్నా వుందా? అతనికెంత బాధకల్గుతుంది! అప్పుడు ఆయనకెంతో అన్యాయంచేసిన వాడనవుతాడు.

"నిన్ను చూడాలని వుంది. త్వరలో వస్తున్నాను" అంటూ 'తండ్రి' వ్రాసిన వుత్తరం చూసి వుక్కిరిబిక్కిరి అయ్యాడు. భయాందోళనలతో తికమక పడ్డాడు.

తను యిప్పుడు క్యాంపులో వున్నాడనీ, అతనిప్పుడు వయోవృద్ధుడై వుండీ అంతదూరం ప్రయాణం చేస్తే ఆరోగ్యం పాడవుతుందనీ, వీలయినప్పుడు తనే కోడలితో, పిల్లలతో స్వయంగా వస్తానని ..... ఏవేవో వుత్తరం వ్రాశాడు.

కానీ వీరభద్రం అనుకున్న విధంగా జరుగలేదు!యిలా ఫోను రావడంతోటే అతనిగొంతులో పచ్చివెలక్కాయ పడ్డట్టయింది! 'ఏం చేయాలి?'

ఎన్నో యుద్ధాలలో నయితం, ఎన్నో భయంకర దృశ్యాల్ని చూసినప్పుడు మొక్కవోని ధైర్యంతో నిలబడ్డ వీరుడు యిప్పుడు నీళ్ళుగారి పోయాడు.

* * *

ఆఫీసుటైం ముగిసినట్టు గంట కొట్టింది. వులిక్కిపడి — యాంత్రికంగా వస్తువుల్ని సర్ది గబగబ బయటపడ్డాడు వీరభద్రం.

చల్లగాలి మెల్లగా వీస్తోంది. పండిన ఆకులు గాలి తాకిడికి గలగల రాలిపోతున్నాయి. సూర్యుడు అస్తాద్రిని చేరుకొంటున్నాడు. చుట్టూ వున్న మేఘాలన్నీ సూర్యునికి వీడ్కోలు పలుకుతూ వున్నాయి..

రోడ్డుపైఅద్దా, ఆపూ లేకుండా మెత్తగా దూసుకుపోతోంది ... విల్‌సన్స్ కారు. గాలికి తలలూపుతోన్న రోడ్డు ప్రక్కని చెట్లువేగంగా వెనక్కు పరుగెత్తుతున్నై ...

ఆలోచనల్లో మునిగినవాడల్లా వుసుగ్గా నిట్టూర్చి,

'డ్రైవర్ .... చాలా స్పీడు వెడుతున్నావ్ మెల్లగానే పోనీ ... " అన్నాడు. కారు ఎంత మెల్లగా పోతే అంతమంచిది అనిపించింది. అతనిపుడు సంజాయిషీ చెప్పుకోవాలి ... పర్యవసానమేమిటో?

పోనీ ... అసలు విషయం ఆయనకు చెప్పేస్తే ...!' ఒక్కక్షణం ఆలోచించాడు.." నువ్వనుకున్నట్లు మీ పుత్రుడ్ని కాను. కాని నిజానికి బ్రతికివున్న మేమంతా నీపుత్రులమే!" ఆయన్ను అమాటలు తృప్తిపరచలేవు ...!!—" ఆలోచనపూర్వమైన అతని భావాలు అతనికి తెలియకుండానే పెదవులు పలికినై.

డ్రైవరు అస్పష్టంగా వినిపించిన ఆ పలుకుకి వులిక్కిపడి వీరభద్రం వేపు చూశాడు.

ఇల్లు దగ్గర పడేకొద్దీ .... అతనిలో ఆ నిశ్చయం మరింత దృఢతరమయింది. యీ విధంగా చేస్తే ఆముసలి హృదయం తృప్తితో, ఆనందంతో నిండిపోతుందని వూహించుకున్నాడు.

కారు దిగి, మెట్లు ఎక్కుతున్న వీరభద్రానికి ఎంత మనోనిబ్బరంతో వుండామన్నా అవ్యక్తమైన తొట్రుపాటుతో, తడబడుతోంది మనసు. శ్వాస దీర్ఘంగా వుంది!

గది గుమ్మందగ్గరే నిలబడి, కాస్త అదురుపాటు తగ్గించుకొని, మెల్లగా వార వాకిలిని లోపలికి త్రోశాడు.

తన నాల్గేండ్ల .... సుధీర్ నవ్వుతూ ఎదురుపడి "నాన్నా! తాతయ్యొచ్చేశాడు ... అదుగో!" అన్నాడు వేలు చూపెడుతూ... వీరభద్రం పరుగు తీశాడు లోపలికి ...

"ఏదీ ... ఎక్కడా ...? రూం నలువైపులకు ఆతృతగా చూశాడు.

* * *

రూం మధ్య చిన్న సోఫాసెట్టు.. మెత్తల మధ్య కూరుకుపోయి, ప్రశాంతిగా సోఫాలోవున్న ఆముసలాయన వీరభద్రందృష్టి నాకర్షించారు.

సోఫాలో పడుకుని, కొద్దిగా క్రిందికి తలవాల్చి మాగన్నుగా నిద్రపోతున్నట్లు కనిపించాడు..

"పాపం! ప్రయాణపు బడలిక కబోలు.. అలసటతో కునుకు తీస్తున్నాడు.. " అనుకున్నాడు వీరభద్రం.

జీవితంలో ఎన్నో ఎదురు దెబ్బలనుధైర్యంగా ఎదుర్కొన్నట్లుంది.. చాల శుష్కించి పోయాడు.. ఆగమ్యమా, జట్టుతలే తెల్లబడి వున్నాయతని అనుభవాన్ని..

ఇంకొక్క క్షణంలో.. ఆ ముసలాయన తనకేసి, ఆశ్చర్యానందాలతో చూస్తాడు. యిరవై ఏళ్ళుగా ఎవరి ఆగమనం కోసమైతే, ఎవరినోటి ద్వారా 'నాన్నా!' అనే ప్రేమంపు పిల్పులు వినలేక, ఆతురతగా వేచియున్నాడో...ఆ తను ఇప్పుడు ఎదురుగా వుండగా చూసి ఎంతగా పొంగి పోతాడో....ముసలాయన నిప్పు జరిగా చూ చెదు..

'ఆబ్బ' ఇటువంటి సమయంలో నేను మీ పుత్రుణ్ణిగానని ఎలా చెప్పడం... అసంభవం... అంతశక్తి తనలో లేదు.. తానుచెప్పలేడు— తలవిదిలించుకున్నాడు నిస్పృహతో...

ఎదురుగా ఆచేయి... సీటిపై రైఫిల్‌నిఎత్తి పట్టుకొన్న ఆచేయి సీటిపై దగ్గర్లో తేలియాడు తున్న టోపీపై జాతీయ చిహ్నం..— చెదురుగా మళ్ళీ ఆదృశ్యం అగుపించిందాయన కళ్ళకు.

కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి!!

ఇంటికొచ్చేంతవరకూ వూహించిన విషయాలన్నీ 'వుఫ్'న ఎగిరిపోయాయి.!

'తండ్రి' వ్రాసిన వుత్తరం చదివినప్పుడు— తిరిగి జాబు వ్రాసేప్పుడు తనలో బలంగానాటుకపోయిన భావాలు తిరిగి నిశ్చలంగా మనసు నావరించినై! ఆతని కళ్ళలో క్రొత్త కాంతులు వెల్లివిరిశాయి.

వీరభద్రం వేగంగా వెళ్ళి ఆయన పాదాలవద్ద కూల బడ్డాడు.. మెల్లగా తన చేతిని ముసలాయన భుజంపై వేస్తూ,

''నా......న్నా...! !'' పిలిచాడు వీరభద్రం.. ఆపిలుపులోని మార్ధవానికి, ప్రేమ పిచ్చులత్వానికి తనకే ఆశ్చర్యం వేసింది.

ఇరవై సంవత్సరాలుగా అంత మాధుర్యంగా, మృదువుగా ఆతని పెదాల నుండి పలుకులు వెలవడలేదంటే ఆశ్చర్యపడవలసిన విషయమేమీ కాదు! నిజానికి ఆపిలుపు తన చెవులకే క్రొత్తగా వినిపించి,హృదయం పులకలు వేసేలా చేసింది. ఏదో విద్యుత్తు నరనరాల ప్రాకినట్లైంది.... అసలు విషయం ఇప్పుడు బయటపడకుండా పోదు! తన అనవసరంగా ఆయన్ను బాధ పెట్టినట్లవుతుంది. తాను చేసిన తప్పిదానికి నిందార్హుడు' గాక మానడు! ఆయన్నుపెట్టిన బాధకు తనకు నిష్కృతి వుండదేమో'—పూర్తిగా విహ్వలచిత్తుడయ్యాడు కెప్టెన్ వీరభద్రం.

కానీ... వీరభద్రం అనుకున్నదానికి విరుద్ధంగా జరిగింది..

ఆ మృదు మధుర పలుకులకు ముసలాయన చెవులునిక్కబొడిచాయి. హృదయం మేల్కొంది. ఆతని శరీరమంతా వింత అనుభూతితో రోమాంచితమైంది.

సంభ్రమాశ్చర్యాలతో తలమున్కలవుతూ, మెల్లగా తలనెత్తాడు...! విశ్వ ప్రయత్నం చేస్తూ కుమారుని దెస పరీక్షగా పరికించాడు!!

''ముసలితండ్రి' ముఖం చూడగానే షాక్ తిన్నట్లయింది వీరభద్రానికి.. దృగింద్రియాలు పూర్వ స్థితిలో లేవు.. ఎడమకన్నులో పాప లేనందువల్లనేమో లోపలికి పోయి, కనురెప్పలు మాత్రమే కలిసిపోయినై... కుడికన్ను ఎర్రగా నిప్పు కణికలా వుంది.. ఆకంటి రెప్పలు బరువుగా రెపరెపలాడాయి.. చూపుకూడా చాలా మందంగా వుంది.. దృష్టిదోషం వుండటంవల్ల పాపం!... ఎదుటి దృశ్యాల్నీ,వస్తువుల్నీ గుర్తుపట్టేందుకు వీలులేకుండా పోయిందాయనకు!

కుమారుని చూడాలన్న కుతూహలం, వుబలాటం రెచ్చిపోయిందాయనలో! కానీ విధిబలీయం. వున్న ఆఒక్క కన్నూ వీలయినంత పెద్దదిగా చేసి.. మసకమసకగా కనిపిస్తున్న వీరభద్రం రూపాన్నీ, భుజాల్నీ, జుత్తునీ అమితానందంతో వణికి పోతున్న హస్తద్వయంతో ప్రేమ పిచ్చిలంగా తడిమాడు.. ముఖమంతా చేతులతో నిమిరి..., రెండు చేతులతో వీరభద్రం ముఖాన్ని దగ్గరగా లాక్కుని, తనముఖం దగ్గరగా పెట్టి, వాత్సల్య పూరిత కంఠంతో...

''బుజ్జీ.....!''—

—జీర బోయిన కంఠంతో, బొంగురుగా పల్కాడు..అశ్రువులు అవిరళధారగా, ముడుతలు పడ్డ చెక్కిళ్ళ మీదుగా జాలువారినై.. ఆపిఅశ్రువులో, ఆనందభాష్పాలో చెప్పడం కష్టం!!

ఆయన పెదవులు పండుటాకుల్లా వణికినై..

వీరభద్రం విచలితుడయ్యాడు. కళ్ళలో నీళ్ళు తిరిగినై.

'నాన్నా!.. నాన్నా !!''—అతని హృదయం ఆరాటపడింది..

'బుజ్జీ !'— ముసలాయన కంఠం వినిపించింది. .

బుజ్జీ—' ఆపదం వీరభద్రానికి అతిక్రొత్తగా అనిపించినా, 'ముసలితండ్రి' తప్త హృదయాన్నించీ వెలువడే పలుకులు మధురంగావున్నాయ్. బహుశ అది ఆయన పుత్రుణ్ణి ప్రేమగా పిలిచే ముద్దుపేరు అయ్యుండవచ్చు!

'నాన్నా.. నేనే....నాన్నా.. నీ వీరభద్రన్ని..' నిండుగా పలికాడు వీరభద్రం..

ముసలాయన ముఖం వి ప్పా రిం ది. అతని హృదయం ఆరాటం తగ్గి ముఖంలో ఆనందరేఖలు తొణికిసలాడాయి.. ఇంత కాలం ఏదో ప్రాణప్రదమైన వస్తువును పోగొట్టుకొని చేతికి దొరగ్గా, అది తనదో, కాదో అన్న సంశయం నివృత్తి చేసుకొన్నట్లుగా కొడుకుముఖాన్ని పరిశీలించాడు..

తనముఖంపై ముఖం పెట్టి ప్రేమమీర చూస్తున్న తండ్రి కంటి నుండి వేడి అశ్రు బిందుఒకటి జారి ముత్యంలాగు పడింది వీరభద్రం బుగ్గపై.!

కన్న కొడుకుకోసం తండ్రి హృదయం ఎంత తపించిపోయిందో ఆనాడు తెలుసుకో గలిగాడు వీరభద్రం.

గదిలో సుదీర్ఘనిస్తబ్దతను భంగ పరుస్తూ సంభాషణకు వుపక్రమించబోయాడు 'వీరభద్రం ఆయన పక్కనే సోఫాలో కూర్చుంటూ—''నాన్నా చాలా ముసలివాడవయి పోయావు నాన్నా...అప్పటికీ, ఇప్పటికీ నీలో ఎంతో మార్పు కనిపిస్తోంది'' అన్నాడు..

ఆయనతో చాలా జాగ్రత్తగా సంభాషణ జరపాలి ఏమాత్రం సందుదొరికినా చిక్కిపోవచ్చు బెరుకుబెరుకుగా, తడబడుతూ పెదాలనుండి [illegible] తున్నై పదాలు.

''అవును బాబూ! ఇరవై యేళ్ళు అయిందిగా దీర్ఘంగా నిట్టూర్చాడు ముసలాయన. మళ్ళీ మొదలెట్టాడు..

నాకు బాగా గుర్తుంది.. అవి విప్లవం రోజులు అప్పుడే నీవుయిల్లు వదిలి పోయావు.. అప్పటికీ నీకింకా పద్దెనిమిదిదాట లేదు.. ఇప్పుడు నీజుట్టలు నిగ్గుదేరి కరుగ్గా వున్నాయి. ఇప్పుడు నీవయస్సు దాదాపు నలభై వుంటుంది. అంతేకదూ....?''

వూఁ ... నలభై ..!' ఆయన ముగించకముందే అందుకున్నాడు వీరభద్రం .... నిజానికి వీరభద్రానికి నలభైమూడు సంవత్సరాలు. తనలోనే సన్నగా నవ్వుకున్నాడు.

తెలిసి, తెలిసి యింత పెద్దపొరపాటు చేస్తున్నానే అని అతడోప్రక్క మధనపడుతూనే వున్నాడు. ఆబాధను తగ్గించుకోడానికి ప్రయత్నిస్తూ, కొడుకు సుధీర్‌ను ముసలాయనకు అందించాడు..

''యిల్లు వదిలేటప్పటికి చిన్న వాణ్నోయ్ నాన్నా ! కానీ యిదిగో నీకో మనవణ్ని యిస్తున్నా యిప్పుడు ... '' నవ్వుతూ పలికాడు వీరభద్రం..

''ఎందుక్కాకూడదట ... నీవు మమ్మల్ని విడిచి ఇరవైయేళ్ళు దాటలేదు మరి ...! ''— నవ్వుతూ మనవడిని దగ్గిరకు లాక్కున్నాడు.

సిగ్గుపడుతూ, ఆచిన్నవాడు తాతయ్యవేపు చూసి, తాతా!' అంటూ ఒళ్ళో వాలిపోయాడు. వాడి అమాయకత్వమూ, నిర్మలానందమూ వీరభద్రం హృదయాన్ని అలంకరించింది.

ఈమాదిరి మొదటినుండి తనకో తండ్రి వుండివుంటే ,నాయిల్లు ఎంతగా కళకళ్లాడేదో.? అనుకున్నాడు.

పిల్లవాడు తాత ఒడిలోకూర్చుని, ఆత్రంగా ఆయన నెరిసిన వెంట్రుకల్ని చిక్కబరుస్తున్నాడు. హఠాత్తుగ ఏదో ఆలోచన మెరిసింది. తాతవేపు తీక్షణంగా చూస్తూ.

''మరి తాతా! చాలా దినాల క్రిందటే తాత చనిపోయాడని చెప్పాడే నాన్న ... '' అనుమానం వెలిబుచ్చాడు.

వీరభద్రం అదిరిపడ్డాడు ముఖం పాలిపోయింది. పిల్లవాడివేపు క్రోర్యంగా చూస్తూ మాట మార్చబోయాడు. కానీ యింతలో అందుకుని.

''అరె బాప్! మిమ్మల్నందర్నీ చూడకుండానే నేను చచ్చిపోతాననుకున్నావా ...?'' పిల్లవాడి తలపై చిన్నదెబ్బవేసి, బుగ్గలు రెండూ నొక్కుతూ ముసలాయన పకపక నవ్వాడు..

''[illegible]!'' — ఊపిరి తిరిగి వచ్చినట్లు [illegible] తేలికపడ్డ హృదయంతో [illegible] వీరభద్రం.

[illegible]

నాన్నా' [illegible] పెద్ద [illegible] వాడిప్పుడు [illegible] చదువు కొంటూ హాస్టల్లో వుంటావున్నాడు. త్వరలో

వాడూ వచ్చేస్తాడిహ ... అబ్బ వీళ్ళిద్దరూ భలే తుంటరి వెధవలులే .... అయితే మాంచితెలివి!''

అవున్నా బాబు! పులికడుపున మేక పుడుతుందా ... ఏమనుకుంటున్నావ్ ... నీవు పిల్లవాడిగా వుండేటప్పుడు ఎలావుండే వాడివో తెలుసా ...? ఎగురుతున్న పక్షుల ఈకలు కావాలని ఒకటే మారాం చేసేవాడివి .. నీకుగుర్తుందా అబ్బ బలే చిలిపితనం చేసి ఏడ్పించుక తినేవాడివి మమ్మల్ని..—'' వుత్సాహంగా చెప్పుకుపోతూ వున్నాడాయన.

యీ పలుకులు —తండ్రి తన కుమారుని గూర్చి చెప్పేటటువంటి ముద్దుమాటలు. అనుభవపూర్వకమైనవి. అప్పను తన తండ్రిగూడా యిలాంటి విషయాలెన్నో చిన్నప్పటి తన ఆగడాల గురించీ, సాహసకృత్యాల గురించీ ఒకప్పుడు చెబుతూ వుండేవాడు.

ముసలాయన మెల్లగా సోఫాలోంచి లేచి నిలబడి, గుమ్మం ప్రక్కగవున్న సంచీ దగ్గరికెళ్ళి పెద్ద మామిడి పండొకటి చేతికి తీసుకొని వచ్చాడు.

''బుజ్జీ! బంగినపల్లి మామిడిపళ్ళు ... ఇవి నువ్వు తిని చాలకాలమైందికదూ!'' చిరునగవుతో పలుకరించాడు.

'అవునవును!' ఈమధ్య ఎపుడో కొన్నిసార్లు తిన్నాను కానీ, అవి మనవేపు పండ్లంత మధురంగా లేవు ... '' అతను జవాబు చెప్పాడు.

ఆతినేర్పుగా పండుపై తొక్కనంతా 'చాకు'తో తీసి మృదువుగామధురసంతో నిండివున్న పండును ఇస్తూ ...

'అబ్బాయి ... నువ్వు ఏసమయంలో యిల్లు వదిలావో గుర్తుందా అసలు ....?' పండును మధ్యగా కోసి పెద్దముక్క మనవడికిచ్చాడు..

''ఆసమయంలో మామిడి పళ్ళు బాగా పండి పక్వంలో వున్నాయ్. అప్పుడు నేను నీకంటే చాల దృఢంగా, బలంగా వుండేవాణ్ణి. చెట్టెక్కి నీకు కావలసిన పళ్ళు కోసియిచ్చేవాణ్ణి.. — మధ్యలో ఆయనకంటం బొంగురుపోయింది.

''యిపుడో ఆజవసత్వాలన్నీ వుడిగిపోయినై.. తనివిదీరా నిన్నూ, నీబిడ్డల్నీ చూద్దామన్నా అదృష్టం లేకుండా వుంది. ఏంచేస్తాం అంతా విధిలిఖితం ...!''

''అదంతా నాకు బాగా గుర్తేనాన్నా!'' వీరభద్రం 'తండ్రి' చెప్పిన విషయాల్తో మనసులో అదృశ్యానికి ఓ ప్రతిరూపం యివ్వడానికి ప్రయత్నిస్తూ జవాబిచ్చాడు. అతని మనసులో మరోదృశ్యం విస్పుటంగా ప్రత్యక్షమైంది.

ఆనాటి రాత్రి .... చిక్కటి రాత్రి .. చిమ్మచీకటి ఆవేళలో ఆర్మీలో చేరిపోవాలనే కుతూహలంతో, ఇదంతా లెక్కచెయ్యకుండా, ఆరాత్రి సమయంలో ఇంటి వెనుకభాగంలో ఎత్తుగోడ దుమికి పరారీ అవడం — కొద్దిగా సొమ్ము, ఒట్టలు ఓసంచిలో పెట్టుకొని పోవడం ..

పోతూ పోతూ గదిలో ప్రశాంతంగా నిద్రపోయే తండ్రిని చూడడం .. —''

ఆలోచనలలో పడ్డవాడు హఠాత్తుగా తెప్పరిల్లి ముసలాయన కళ్ళవేపు చూస్తూ,

''అదేమిటి నాన్నా! నీకళ్ళకేమయింది .....'' ప్రశ్నించాడు వీరభద్రం.

ఆదే ... ఆనరరూప రాక్షసులు ... తెల్లవాళ్ళు చేసిన దారుణకృత్యం బాబూ ... యుద్ధంరోజులు ... తెల్లవాళ్ళు విచ్చలవిడిగా దేశం మీదబడి, యిచ్చవచ్చినట్టల్లా ప్రవర్తించారు. ఎందరో వనితల మాన,ప్రాణాల్ని తీసేశారు.. గింజలకోసం ఎందర్నో గొడ్డుల్ని బాదినట్లు బాదారు. ఇంకా నేను అదృష్టవంతుణ్ణి. వారి చర్యలమూలకంగా పూర్తిగా అంధుడుగాకుండా లోకపు పోకడల్నీ, యిహలోకపు ఆనందాన్ని చూచే యోగ్యతను పూర్తిగా పోగొట్టుకోలేదు ..''

ఇదంతా వింటూంటే వీరభద్రానికి నిజంగా చాల బాధ కలిగింది.

ఒకసారి మిలిటరీ నుండి తను ఇంటికి పోయాడు. అప్పుడు తండ్రి సమాధిని సందర్శించాడు. ఆసమయంలో అతని ఆవేదనను వ్యక్త పరచడానికి మాటలు చాలవు..

యిపుడాయన మళ్ళీ అలాంటి విషయాలు చెబుతూంటే గతస్మృతులు కళ్ళకు కట్టినట్లుయింది.

బాధలకు గురైన ప్రజలందరూ ఎంతటి త్యాగానికి ఒడిగట్టినారు ఆ విప్లవాల్లో ...! స్వాతంత్ర్య సంకుల సమరంలో, ఎంతమంది తమ ప్రాణాల్ని త్యాగం చేశారు. వాళ్ళంతా నిజంగా అదృష్టవంతులు. అంతటి అదృష్టానికి కొనియాడాల్సిందే.

వీరభద్రం ఆయన చేతుల్ని తన చేతుల్లోకి తీసుకొంటూ ''నాన్నా! ఆరోజుల్లో నువ్వు ఎన్నో బాధలకు గురయ్యావు కదూ..?'' గోముగా ప్రశ్నించాడు వీరభద్రం.

''కష్టాలకీ... నష్టాలకీ నేనేమాత్రం బాధ పడలేదబ్బాయ్.! కష్టపడ్డాము.. శ్రమించిన దానికి తగిన ప్రతిఫలం అబ్బింది. అంతేచాలు..''

కళ్ళు పోయినపుడు అంటూ వుండేవాణ్ణి..

''నాకు కనీసం అర్ధకంటి దృష్టివుంది! చాలు! దాంతోనే మనవిజయాన్ని కళ్ళారా దర్శించగలను. హర్షించ గలను.. అంతేచాలయ్యా బాబు !

జేబులోంచి 'పుగాకు చుట్ట' బయటకు తీశాడు ముసలాయన.. కుమారుడు దాన్ని'సిగార్ లైటర్'తో వెలిగించాడు.. గట్టిగ ఒక దమ్ము లాగి. పొగ విడిచాడు తండ్రి.. సుళ్ళు తిరుగుతూ గదిపైభాగానికి ఎగిరిందాపొగ..!

''అబ్బ...! ఆఅర్ధకన్నుతోనే నిన్నూఈనాడు చూసి సంతృప్తి పొందగల్గాను.. అది నా అదృష్టమను కోవాలి..! ఎన్నో సంవత్సరాలుగా పూడుకు పోయిన నా కోర్కె నెరవేరింది..

చాలు..!! ఆ లరకన్నే ఆనందాశ్రువుల్నిరాల్చగలదు..!''

తల పంకించాడాయన... కను కొసుకుల్లో నీళ్ళు నిలిచాయి..

వీరభద్రం తన చేతిగుడ్డతో ఆయన ఆశ్రుపూరిత నయనాల్ని మృదువుగా తుడిచాడు..

''యిక పాతగాథలన్నీ మరిచిపోనాన్నా...మనం మళ్ళీ కలుసుకున్నాం.. అంతేచాలు..!!''అన్నాడు. వీరభద్రం.

యింతలో వీరభద్రం యిల్లాలు తలుపుతెరుచుకొనిలోనికి వచ్చింది.. ప్రేమగా భార్యవైపు చూసి వుస్సురన్నాడు వీరభద్రం..

దగ్గరగా ఒచ్చిన భార్యతో,

''చూశావా.. నాన్నా వచ్చాడు..'' ఆమె చీరను మునివేళ్ళతో పట్టి లాగుతూ అన్నాడు..

పరిస్థితి అర్ధంఅయినట్లు తలవూపిందామె..

యింకాస్త ముందుకు నడిచి..''మామయ్యా!'' కంటంలో మార్దవం తొణికిసలాడేలా పిలిచింది.

''భోజనానికి పోదాం లేవండి.. మీ కోడలు.. తానే స్వయంగా వంట చేసింది..'' వీరభద్రం భోజనానికి లేపాడు..

'పదబాబూ!' అంటూ కొడుకు భుజంపైన ఒక చేయీ, కోడలి భుజంపైన మరో చేయీ వేసి లోనికి నడిచాడు.

మూడు తరాలవ్యక్తులూ డైనింగ్ టేబులు చుట్టూ వున్న కుర్చీలు ఆక్రమించి భోజనాలకు వుపక్రమించారు.

ముసలాయన మనస్సిప్పుడు ప్రశాంతంగా వుంది!!

కొడుకుతో మాట్లాడుతూ, తలాడిస్తూ, చుట్టూ పరికిస్తూ, తృప్తిగా భోజనం చేయసాగాడు.. అతనిలో మరేలాంటి విషాద వీచికలుగానీ, విచార చిహ్నాలుగానీ లేవు..!

అతని సంతోషాన్ని యినుమడింప జేస్తూ, ఓకప్పునిండా మధురమైన ద్రాక్షరసాన్ని కలిపి ఆయన నోటికి అందించాడు వీరభద్రం.

ఓహో! నీవింకా మరిచి పోలేదన్నమాట..బేష్ కప్పు చేతిలోకి తీసు కొంటూ పలికాడుముసలాయన.. ఒక్క గుక్కలో ద్రాక్షరసం త్రాగేసి కప్పుబల్లమీద పెడుతూ తనకుమారుడుసైన్యంలోకి వెళ్ళక ముందు ప్రతి దినమూ భోజనం దగ్గర ఒకముద్దతానే స్వయంగా తినిపించిన రోజులు గుర్తుకొచ్చి.. కాస్సేపు అలాగే వుండి పోయాడు.

ప్రీతి పాత్రమైనవి మరింత తినిపించడానికి ప్రయత్నించాడు వీరభద్రం.. నిజానికి తిండి ఆయనకు ఏమాత్రం నోట్లోకి పోలేదు. అప్పటికే ఆయన కడుపు ఆనందంతో నిండిపోయింది. కొడుకూ, కోడలూ, మనవడు భోజనం చేస్తూం టేచూస్తూ, చిరునవ్వులు చిందిస్తూ ఉదాసందంతో కూర్చుండి పోయాడు.

''నిజంగా యిపుడు చాల అభివృద్ధిలోకొచ్చావు నాకెంతో సంతోషంగా వుంది...నువ్వు సుఖంగా ఆరోగ్యంగా వుంటున్నావ్..నాకదే..చాలు.. ఆదే పది వేలు బాబూ!'' ఉత్ప్రయత్నంగా ఆయన పెదాలనుండి విడివడ్డాయి.

( మిగతా 64 వ పేజీలో )

(ప్రక్క పేజీ తరువాయి)

అది మా తప్పేను. మాసంగతి తెలుసున్న వాడివి నువ్వేమీ అనుకోకు. వీళ్ళకి మొన్న వేసంగి శలవుల్లోనే పెళ్ళి చేశాము. శోభనంకూడా చేశాము. అందు చేతనే నిశ్చింతగా యీవూరు చదువుకు పంపించాం'' అంటూ నవ్వుముల్లీ అందుకున్నారు.' అదివిని వున్నవాళ్ళందరూ నవ్వక వుండలేకపోయారు. ప్రిన్సిపాలు తాను పొరబడ్డాననుకున్నాప్పటికి తన డ్యూటీయే తాను చేశాననే తృప్తితో నవ్వు కలిపేసాడు.

ఆమర్నాడు సుందరమ్మగారు పార్వతమ్మగారు శ్యామలని పిలిచి మళ్ళీ ఆప్యాయంగా మాట్లాడడము ప్రారంభించారు.. వాళ్ళు మాట్లాడుకుంటుండగానే ''శ్యామలా అంటూ ప్రక్కగది లోంచి కేక వినపడింది. ''ఈ వేళ మీరుకూడా సినిమాకు రావాలండీ'' అంటూ బలవంతపెట్టవది. శ్యామల సుందరమ్మ పార్వతమ్మ గార్లని''. అల్లాగేనమ్మా నువ్వు వెళ్ళేటప్పుడు మరోసారి పిలు'' అన్నారు పార్వతమ్మగారు. ''అబ్బాయినిఒకసారి యిల్లారమ్మనమ్మా నేను చూస్తాను' అంది సుందరమ్మ . పెద్దగదులు దొరక్క శ్యామల ఒకచోట, భాస్కరరావు ఫ్రెండ్సుదగ్గర వుంటున్నారేకాని వాళ్ళిద్దరూ నూతన దంపతులన్న సంగతి గ్రహించలేక పోయామని ఒకరిమొహం ఒకరుచూచి నవ్వుకొన్నారు. తమ అవివేకానికి సుందరమ్మ పార్వతమ్మ గార్లు.

★

# అనుబంధాలు

[13 వ పేజీ తరువాయి]

కాస్సేపు తరువాత ''అరెబాబూ! ఇక్కడనీకొక పుట్టుమచ్చ వుండాలే.. ఏవయింది..'' నోటి దగ్గర తడుముతూ ప్రశ్నించాడు..

ఆయన ప్రశ్నకు అన్నం తింటున్న వాడల్లా అదిరి పడ్డారు వీరభద్రం..చప్పున జవాబివ్వలేక.. ''ఓ..అదా.. నా..న్నా..'' తడబడ్డాడు.. అతడి అవస్థకు ఫక్కున నవ్వుకొని ఆయన భార్య..

''అదా మావయ్యా! ఒకరోజు గడ్డం చేసుకొంటూంటే సరిగ్గా అక్కడే తెగింది.. అశ్రద్ధ మూలంగా సెప్టిక్ అయింది... తరువాత ఆపరేషన్ చేసుకోవాల్సి వచ్చింది..

అప్పుడు మచ్చ పోయింది. అదేగాయం కూడా కనిపించడల్లే!'' అర్ధాంగి సర్దిపుచ్చింది.. ఆమె యుక్తి యుక్తానికి విస్తు పోయాడువీరభద్రం..

''బ్రతుకు జీవుడా!'' అనిమనసులో అనుకొని దీర్ఘంగా శ్వాసవిడిచాడు..ఆపద తీరిందనుకునేంతలో,

''అబ్బాయ్.! పెద్దాడివయ్యేసరికి అలవాట్లన్నీ మార్చుకున్నట్లున్నావే.. అప్పుడు నువ్వు ప్రతి పనికీ ఎడం చెయ్యి వుపయోగించే వాడివి.'' తఫీమని ప్రశ్నించాడు.

''అది నాన్నా!మిలిటరీలోఎడంచేయి వుపయోగించనియ్యరు. క్రమంగా కుడిచేయి అలవాటు చేసుకున్నాను. ''

ముసలాయనకు తెలీదు గనుక.. 'కామోసు!' అనుకున్నాడు.

అప్పటికే సరిగ్గా రాత్రి పదకొండు గంటలయింది. ద్రాక్షరసం ఓచుక్క ఎక్కువ పడిందేమో కొద్దిగా తూలసాగాడు ముసలాయన!

భోజనం దగ్గర్నించీ లేచారు.

పడక దగ్గరకు చేరాడు ముసలాయన..

'ఓష్! ఇన్నాళ్ళకు నాపుత్రుణ్ణిచూడగలిగాను. అంటూ కావలించుకొన్నాడు. క్రమంగా, నిశ్చింతంగా నిద్రాదేవి ఒడిలో ఎనలేని తృప్తితో ఒరిగి పోయాడు. ఆయన నుండి దృష్టి మరల్చి, లైటార్పేసి, మెల్లగా బరువెక్కిన హృదయంతో తన గదిలోకి వెళ్ళి పోయాడు కెప్టెను వీరభద్రం.

గదిలో కిటికీ దగ్గర నిలబడి, ఆ చిరు చీకటిలో ప్రకృతిలోకి దృష్టి సారించి, సిగరెట్టు పొగలు వదుల్తూ ''ఏమిటి ఈవిడదీయరాని బంధం.. వివరించలేని అనుబంధాలు'' ఎదురుగా నిర్మలాకాశం.. వింత కాంతులతో ప్రజ్వలించే అందాల తారలు ఆకాశాన్ని ఆవరించాయి.

ఎదురుగా గుడ్డి వెలుగులో వృద్ధ వృక్షం, ఆకులు రాలిపోగా, మోడువారి ఒంటిరిగా దుప్పికొమ్ముల్లాగా నిలిచి వుంది. ప్రక్కనే కలకలలాడే ఓచిన్నారిలత ఆవృక్షపు మొదలుకు అల్లుక పోయి వుంది.

గట్టిగా శ్వాసవిడిచి..''ఏమిటో ఈవిడదీయరాని అనుబంధం..'' అప్రయత్నంగా అన్నాడు ఆమాటలు,అతడు విడిచిన దీర్ఘ నిశ్వాసంతో, విడిచిన సిగిరెట్టు పొగల అలల్లో కలిసి పోయింది.

★

# కృష్ణవేణి

[52 వ పేజీ తరువాయి]

''స్వయంగావెళ్ళి మాట్లాడాల్సిన సంగతి కాబట్టి వెళ్ళివచ్చాను. ఈమాత్రానికి మీకేం లోటు వచ్చింది? అన్నీ గోపీతో ....''

అరుణా! నన్నింకా రెచ్చగొట్టకు. చేసింది చాలక సమర్ధించుకోబోతావేం? మహా లోటు లేకుండా అమర్చివెళ్ళావ్. టిఫిన్లకీ — కాఫీలకీ మొహంవాచి వచ్చాననుకున్నావా?ఎందుకొచ్చాను? ఎవరికోసం వచ్చాను? కావలసినవేమిటో గోపీ చూస్తే నిండిపోతుందనుకున్నావా? అసలు నేను వచ్చానని నీకేమైన సంతోషంగా వుందా?''

అరుణ జవాబేమీ చెప్పకుండా టిఫిన్ప్లేటు తీసుకొచ్చి ముందిడి ''తినండి చల్లారిపోతుంది'' అంది.

''చాల్లే మమకారం. ఇంకా ఫలహారమెందుకు? నీఅనురాగంతోనే కడుపంతా నిండి' వుంది.'' అంటూ ప్లేటు తోసివేశాను.

ఓక్షణం ఆగి— మీకింత కోపం వస్తుందని అనుకోలేదు.'' అంది నెమ్మదిగా.

''కోపం కాదు అరుణా! కోపమైనా కొంత సేపటికి పోతుంది. గుండెల్లో పేరుకొంటున్న బాధ ఏనాటికీ కరగదు. ఒకప్పుడు నిన్ను తల్చుకుని ఎంతో మురిసిపోయాను. నా మురిపెం అంతా ముక్కలై పోయింది. నేను కోరుకొంటున్న దాంపత్య జీవితాన్నే పొందలేకపోతున్నాను. జీవితానికి ఆలోటు చాలు—నువ్వు ఆర్డర్ చేసి వెళ్ళే టిఫిన్లూ,కాఫీలూ కాదు నాకు కావల్సింది. నామనసు సంతోషపెట్టాలని నీకెందుకు తోచదో నాకర్థం కాదు.'' అనుకోకుండానే ఆనాలుగు ముక్కలూ వెల్లడించాను శాంతంగా.

—(సశేషం)

# కవితా చిత్ర

కవితా చిత్ర అనే నూతన ఫిలిం కంపెనీ ఒకటి ఒక బెంగాలీ నవల ఆధారంగా సాంఘిక చిత్రాన్నొకదానిని నిర్మించబోతున్నది. దీనినిర్మాతలు శ్రీ కె.సత్యనారాయణ, డి.శ్రీరామమూర్తి. మాటలు: ఆచార్య ఆత్రేయ వ్రాస్తున్నారు. దర్శకత్వాన్నికూడా శ్రీ ఆత్రేయ నిర్వహించుతారు. పాటలను శ్రీ నార్ల చిరంజీవి, శ్రీశ్రీ వ్రాస్తున్నారు. కళ: శ్రీ గోఖలే. సంగీతం: శ్రీ పెండ్యాల నాగేశ్వరరావు. చిత్ర నిర్మాణ నిర్వహణ శ్రీ కె. కోటేశ్వరరావు.

శ్రీ అక్కినేని నాగేశ్వరరావు, కృష్ణ కుమారి నాయకా నాయిక పాత్రలకు ఎన్నుకోబడినారు. ఇతర ముఖ్యపాత్రలను గుమ్మడి, రేలంగి, రమణాచలం, పద్మనాభం, గిరిజ, సూర్యకాంతం, నిర్వహించుతారు. ఈ కంపెనీవారు దీపావళినాడు అరుణాచలం స్టూడియోలో ఒకపాటను రికార్డు చేశారు. ప్లేబ్యాక్ గాయనులు సుశీల, జానకి, సరోజిని ఈ పాటను పాడారు.

ఈ ప్రారంభోత్సవానికి అన్నపూర్ణా పిక్చర్సు నిర్మాత శ్రీ మధుసూదనరావు, శ్రీ అక్కినేని నాగేశ్వరరావు, శ్రీమతి కృష్ణ కుకుమారి, శ్రీ గుమ్మడి వెంకటేశ్వరరావు, శ్రీ రేలంగి వెంకట్రామయ్య, శ్రీ రమణాచలం, శ్రీ పద్మనాభం, శ్రీశ్రీ, శ్రీ నార్ల చిరంజీవి మున్నగు ప్రముఖులు పలువురు వచ్చారు.

★

Printed and Published by S. V. Swami, B.A., at The Andhra Prabha Press, Gandhinagar, VIJAYAWADA-2.
Editor: Neelamraju Venkata Seshaiah.